

తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జెఎన్‌ఎఫ్ వీసీ గంగాధర్, మెట్టు సాయి, ధన్‌రాజ్ తదితరులు

గంగపుత్రులు తమ హక్కులను సాధించుకోవాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు సంఘటితంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మెట్టు ధన్‌రాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గంగాధర్, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయిలు హాజరై డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. గంగపుత్రులు ఆర్థిక, విద్య, సామాజిక రంగాలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమైన కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

లో ప్రెషర్ సమస్య పరిష్కరించాలి: కార్పొరేటర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చాలాకాలంగా గాంధీనగర్ డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె జలమండలి ఎండీని కలిసి లోప్రెషర్ సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వాటర్‌బోర్డ్ ఎండితో మాట్లాడుతూ తమ డివిజన్‌లో జలమండలి అధికారులో లోప్రెషర్ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. వేసవిలో పరిస్థితి దారుణంగా మారే పరిస్థితి ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్‌బోర్డు జీఎం, డీజీఎంలకు వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తానని, త్వరలోనే లోప్రెషర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని ఎండీ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని వివరించారు.

ప్రజా కళాకారుడు నాజర్‌కు నివాళి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తన గంభీర గళంతో వేలాది శ్రోతలను ముగ్ధులను చేసి ప్రజలను చైతన్యపర్చిన అద్భుత బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ప్రజా కళాకారుడు అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపరలో భాగంగా నాజర్‌యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన నాజర్‌కు మంచి స్వరం వరంగా వచ్చింది అన్నారు. ఆయన తొలి రోజుల్లో భిక్షాటన కూలి పనులకు వెళ్లి సంగీతంలో శిక్షణ పొందారు అన్నారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ హేతువాది అయిన నాజర్‌కు కమ్యూనిస్టు పార్టీ ప్రజానాట్య మండలి వేదికలు ఏర్పాటుచేసి ఆయన బుర్ర కథలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. కొన్ని సినిమాల్లో నటించి బుర్రకథ చెప్పినా అక్కడి వాతావరణం నచ్చక తిరిగి తన రంగస్థల కళను నమ్ముకున్నారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ నాజర్‌కు కేంద్రప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించి ఆయనపై తమ గౌరవం ప్రకటించారన్నారు.

డాక్టర్ జయప్రకాష్ సాయ్‌కు ఐడీఎఫ్ డయాబెటీస్ కేర్ ఫెలోషిప్

నల్లకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ జె. జయప్రకాష్ సాయ్ డయాబెటీస్ రంగంలో నైపుణ్యత, కృషిని పరిగణలోకి తీసుకుని ఐడీఎఫ్ డయాబెటీస్ కేర్ ఫెలోషిప్ అవార్డును ఇంటర్నేషనల్ డయాబెటీస్ ఫెడరేషన్ ఎంపిక చేసింది. డయాబెటీస్ ఉన్నవారు ఎదుర్కొంటున్న ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఈ అవార్డు ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలో డా.జే.జయప్రకాష్ సాయ్ విలేకరులతో మాట్లాడుతూ డయాబెటీస్ ఉన్న వారి జీవితాలను మెరుగుపరడంలో ఈ వ్యాధిని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఐడీఎఫ్ డయాబెటీస్ కేర్ ఫెలోషిప్ అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డు పొందడం తనకు సంతృప్తి కల్పించిందన్నారు.



అంబర్‌పేట పీఎస్‌లో అదృశ్యమైన విద్యార్థులు

వీడిన విద్యార్థుల అదృశ్యం కేసు

● భువనగిరిలోని తాత ఇంట్లో ఉన్న విద్యార్థులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీని అంబర్‌పేట పోలీసులు కనిపెట్టి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. ప్రేమ్‌నగర్ న్యూచైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అజ్మత్, హర్షవర్ధన్, నితీష్, తేజనాథ్‌రెడ్డి బుధవారం రాత్రి తమ తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వారికోసం పోలీసులు సీసీ కెమెరాల ద్వారా వారి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఇంట్లో నుంచి వెళ్లిన విద్యార్థులు ముందుగా కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి సికింద్రాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కి వరంగల్‌లోదిగారు. గురువారం అంతా వరంగల్‌లో గడిపిన విద్యార్థులు సాయంత్రం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి భువనగిరిలో రాత్రి 12 గంటల సమయంలో దిగారు. అక్కడి నుంచి భువనగిరి దగ్గర ఉన్న దాతూర్‌పల్లిలో ఉంటున్న అజ్మత్ అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. ఈ సమాచారం అజ్మత్ తాత విద్యార్థులు తల్లిదండ్రులకు పోలీసులకు తెలియజేశారు. అంబర్‌పేట పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి శుక్రవారం దాతుర్‌పల్లిలో ఉన్న వారిని తీసుకొచ్చి అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థుల అదృశ్యం కేసు సుఖాంతం కావడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



జితేందర్ దేశ్వాని

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దోమలగూడ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడలో నివాసం ఉండే జితేందర్ దేశ్వాని(53) ప్రైవేట్ ఉద్యోగి. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈ నెల 19న తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. జితేందర్ దేశ్వాని కుటుంబ సభ్యులు చుట్టు పక్క ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లోని లేదా ఫోన్ నంబర్ 9849563715కి సమాచారం అందించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లకు భారీగా దరఖాస్తులు

- అంబర్‌పేట నుంచి 44,18
- ముషీరాబాద్ నుంచి 36,661
- ఎంపికైన వారికి రూ. 5 లక్షల సబ్సిడీ రుణం
- బేస్‌మెంట్ కట్టగానే లక్ష రూపాయల చెల్లింపు



రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. తెల్లరేషన్ కార్డు కలిగిన పేద ప్రజలు ఇందిర్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వం పెట్టిన నిబంధన ప్రకారం వారి ఇంటి నిర్మాణానికి 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలు ఇవ్వనున్నది. ముందుగా బేస్‌మెంట్ వేయగానే లక్ష రూపాయలు లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందిస్తుంది. అంబర్‌పేట సర్కిల్ (అంబర్‌పేట నియోజకవర్గం) నుంచి 44,181 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో హిమాయత్‌నగర్ డివిజన్ నుంచి 4907, కాచిగూడ డివిజన్ నుంచి 6203, నల్లకుంట డివిజన్ నుంచి 5844, గోల్నాక డివిజన్ నుంచి 8943, అంబర్‌పేట డివిజన్ నుంచి 11349, బాగ్‌అంబర్‌పేట నుంచి 6943 దరఖాస్తులు వచ్చాయి.



జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం

ముషీరాబాద్ సర్కిల్ (ముషీరాబాద్ నియోజకవర్గం) మొత్తం 36,661 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అడిక్‌మెట్ డివిజన్ నుంచి 4982, ముషీరాబాద్ డివిజన్ నుంచి 5732, రాంనగర్ డివిజన్ 8217, బోలక్‌పూర్ డివిజన్ 6913, గాంధీనగర్ డివిజన్ 3349, కవాడిగూడ డివిజన్ నుంచి 7468 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక కోసం రెండు సర్కిళ్ల అధికారులు ముమ్మరం గా డివిజన్ల వారీగా సర్వేలు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖారు వరకు సర్వే పూర్తి చేసి లబ్ధిదారుల ఎంపిక చేసి ప్రభుత్వానికి ఇవ్వడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇళ్లలో లేకపోవడంతో సర్వేలో జాప్యం

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది దరఖాస్తు దారులు ఉన్న ఇళ్లల్లో ఉండకపోవడం, ఒకవేళ ఉన్న సర్వే సిబ్బంది వెళ్లినప్పుడు తలుపుకు తాళం వేసి ఉండడంతో సర్వేలో జాప్యం జరుగుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. కొంత మంది సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి సమాచారం అడిగి తెలుసుకోవడం జరుగుతుంది, ఫోన్‌లతో ఇచ్చే సమాచారంతో కొంత ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. కొంత మంది దరఖాస్తుదారులు సర్వేకు సహకరించడం లేదనే విమర్శలు కూడా రావడం జరుగుతుంది.

లబ్ధిదారుల ఎంపికకు చర్యలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం జరుగుతుంది. దరఖాస్తు దారులందరూ సర్వే సిబ్బందికి తమ వివరాలను తెలియజేసి సహకరించాలి. దరఖాస్తుదారుల ఇల్లు డోర్ లాక్ ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక చాలా ఆలస్యంగా జరుగుతుంది.

- మారుతిదివాకర్‌రావు, ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్స్ డీఎంసీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోపరాజు నారాయణరావు, శివప్రసాద్

'రేపటి స్వప్నం' కథల సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత జన్నాభట్ల నరసింహ ప్రసాద్ రచించిన 'రేపటి స్వప్నం' కథల సంపుటి గ్రంథావిష్కరణ సభ జరిగింది. అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి సందేశాన్నిచ్చే కథలు ఈసంపుటిలో ఉన్నాయన్నారు. సమస్యలను వివరించి వాటికి పరిష్కారాలను చూపడం నరసింహప్రసాద్ ప్రత్యేకత అన్నారు. పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత గోపరాజు నారాయణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిన్నెర రఘురామ్, త్రోవగుంట వెంకట సుబ్రహ్మణ్యం, డా. అక్కిరాజు సుందరరామకృష్ణ, పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు భక్తిపాటలు ఆలాపన కార్యక్రమం జరిగింది.



ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్ ట్యాంక్ నుంచి ఏర్పాటు చేసిన ట్యాబ్

ప్రభుత్వ ఆస్పత్రికి వాటర్ ట్యాంక్ వితరణ

ముషీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్య పరిష్కారానికి రాజంపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు వాటర్ ట్యాంక్ అందజేశారు. శుక్రవారం ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఆస్పత్రికి వచ్చి రోగులకు నీటి సమస్య తలెత్తకుండా వాటర్ ట్యాంకు నుంచి పైప్‌లైన్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా జరిగేలా చేశామని ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆబిడ్స్‌లో ఏర్పాటు చేసిన ఆస్తి పన్ను పరిష్కార వేదిక

నేటి నుంచి 29 వరకు ఆస్తి పన్ను పరిష్కార వేదిక

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ కార్యాలయాల్లో ఆస్తి పన్ను పరిష్కార వేదిక ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని, ఆబిడ్స్‌లోని ఆరవ అంతస్తులో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీఎంసీ మారుతీదివాకర్‌రావు తెలిపారు. ఆస్తి పన్ను కు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే ఈ వేదికలో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.



రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు శివరాం, మన్నె శ్రీధర్‌రావు

నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేష్

నల్లకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లకుంటకు చెందిన తాలుకా రాజేష్, ఉపాధ్యక్షుడిగా గోకుల కల్యాణ్‌లు నియమితులయ్యారు. శుక్రవారం అంబేడ్కర్ సేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లు శివరాం, జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావులు సేన రాష్ట్ర అధ్యక్షుడిగా తాలుకా రాజేష్, ఉపాధ్యక్షుడిగా గోకుల కల్యాణ్‌లను ప్రకటించి వారికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాలుకా రాజేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం కృషి చేస్తాన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లు శివరాం, జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డుగ్రహీతలతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మాతృభాషను కాపాడుకుందాం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను కాపాడుకుందామని సీబీఐ మాజీ జేడీ వివి లక్ష్మీనారాయణ అన్నారు. త్యాగరాయగానసభలో శుక్రవారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కోటపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం, తెలుగు భాషా అవార్డుల ప్రదాన సభ జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పిల్లలు మాతృభాష ద్వారా నేర్చుకోవడం మొదలుపెట్టి మరో భాష నేర్చుకుంటే వారి విద్యా జీవితం సాఫీగా సాగుతుందన్నారు. సురేష్, భాస్కర్‌రావు, అంజయ్య, భాస్కర్, ప్రసాద్, రమాదేవి, లక్ష్మి, ఝాన్సీ, ఆలియాబాను, పద్మావతి, సుహాసినిలను అవార్డులతో సత్కరించారు. మధుసూదన్, రాధాకుసుమ, మురళీమోహన్‌రాజు, మురళి, మహేశ్వరరావు, జయకుమార్, పూర్ణప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్‌కు పరామర్శ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన హ్యూమన్ రైట్స్ సంరక్షణ సంఘం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ దోనేటి సత్యంను శుక్రవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఆయన నివాసంలో సంఘం ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనను కలిసినవారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానందం, జయంత్, రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బర్కత్‌పురా, కాచిగూడ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30, పోస్టాఫీస్, ముషీరాబాద్ పరిధిలో 12 నుంచి 1, తాళ్ల బస్తీ, గోశాల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4, జాఫర్ అలీ బాగ్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి తదితరులు

రాంనగర్ డివిజన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు

రాంనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లో పలు చోట్ల కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని కార్పొరేటర్ కె.రవిచారి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని హరినగర్ అబ్బసాయి మెన్షన్ వద్ద కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు రాంచందర్, తదితరులు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా

28న ఢిల్లీలో జాతీయ సదస్సు

నల్లకుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని ప్రగల్భాలు పలికి పదేళ్ల పాలనలో అది కార్పొరేట్ కా సాత్, కార్పొరేట్ కా వికాస్‌గా మారిపోయిందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నేతలు ఆరోపించారు. శుక్రవారం విద్యానగర్‌లోని మాస్ లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు కె.జి.రాంచందర్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రమ, ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేష్, సదానందంలు మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం కోసం పోరాడాలని కోరుతూ ఈ నెల 28న ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ దేశ, రాష్ట్రవ్యాప్తంగా మాస్ లైన్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నదని వారన్నారు.

ఘంటసాల గానం అజరామరం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల గానమాధుర్యం తెలుగుజాతి ఉన్నంతవరకు అజరామరంగా నిలిచి ఉంటుందని ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఇండియా వ్యవస్థాపకులు వంశీ రామరాజు అన్నారు. వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) సమర్పణలో శుక్రవారం సాయంత్రం త్యాగరాయగానసభలో ఘంటసాల అవార్డు గ్రహీత దాసరి శ్రీహరి సారథ్యంలో పాటకు పట్టాభిషేకం పేరిట తెలుగు సినీ సంగీత విభావరి(కరవోకె) కార్యక్రమం జరిగింది. గాయనీగాయకులు శ్రీహరి వైఎస్ రామకృష్ణ, సురేఖామూర్తి, ఇందునయన, సుధామయిలను సన్మానించారు. కార్యక్రమంలో సుధారామరాజు, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ అడ్డుకోవాలని, వర్గీకరణతో నేతకాని, మహర్ కులాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర నేతకాని, మహర్ కుల సంఘాల అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ న్యూ ఢిల్లీ గారికి వినతిపత్రం పంపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 క్లాస్ 9 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా తెలంగాణలో వర్గీకరణ పేరుతో మాదిగ కులాలకు ఎక్కువ రిజర్వేషన్ అవకాశాలు కల్పించి ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ సర్కార్ పాల్పడుతుందన్నారు. తెలంగాణలో ఎస్సీ జాబితలోని మెజారీటి జనాభా కలిగిన 26 కులాలకు అన్యాయం చేసే విధంగా ఉండే వర్గీకరణ బిల్లు, చట్టం పైన కోర్టుల్లో సవాల్ చేస్తామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జెఎన్ రావు, దళిత బహుజన పార్టీ డీబీపీ గ్రేటర్ అధ్యక్షులు మద్దెల ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన అడ్‌హాక్ కమిటీ సభ్యులు

తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ ఆవిర్భావం

● భవిష్యత్ కార్యాచరణకు అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ జర్నలిస్టుల ఐక్యతకు కృషి మొదలైంది. తాజాగా తెలంగాణ జర్నలిస్ట్ ఆవిర్భవించింది. ఈ మేరకు శుక్రవారం చిక్కడపల్లిలో బీసీ జర్నలిస్టుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణకు అడ్‌హాక్ కమిటీని ఎన్నికున్నారు. గౌరవ సలహాదారులుగా సీనియర్ జర్నలిస్టులు అంబటి సురేందర్‌రాజు, కె. వేణుగోపాల్, కైలాష్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, ప్రెసిడెంట్‌గా నీలం వెంకన్న, వైస్ ప్రెసిడెంట్‌గా ఇంద్రసేన్, ప్రధాన కార్యదర్శిగా బద్దీల శ్రీధర్ యాదవ్, కో ఆర్డినేటర్‌గా దొమ్మాట వెంకన్న, కార్యనిర్వాహక కార్యదర్శిగా మహేశని లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలమీద అనేక చర్చలు జరిగాయి. ముఖ్యంగా మండల, జిల్లా స్థాయిలో ఫోరం బలోపేతానికి కృషి చేయాలని తీర్మానం చేశారు.

